ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023
5
విజయనగరం

20 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, తక్షణమే గ్రాస్ పే అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 20 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. ఈమేరకు బుధవారం డిఇఒ లింగేశ్వరరెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమని, మినిమం టైమ్ స్కేల్ పై జీఓలు మీద జీవోలు ఇచ్చి, అమలు చేయడం లేదన్నారు. ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తూ, కొత్త విధానాలకు తెరలేపారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కెజిబివి టీచర్లకు లకు జీతాలు పెంచి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే దశల వారి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

అంతా ఉత్తుత్తి పంపిణీ

సాగులోవున్న భూములకే పట్టాలట!

చేతులు మారిన భూముల సంగతేంటో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాటికాయంత ప్రచారం చేసుకుని, ఆవగింజంత సాయం చేసినట్టుగా ఉంది దళితులకు భూపంపిణీపై ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారం. ఇంకా చెప్పాలంటే ఆ ఆవగింజంత భూమి కూడా దళితులకు దక్కే పరిస్థితి ఉందని గట్టిగా చెప్పలేని పరిస్థితి. జిల్లాలోని దళితుల్లో ఎక్కువ కుటుంబాలు ఉపాధి, ఉద్యోగాలకు నోచుకోలేక తీవ్ర అస్థలు పడుతున్నారు. పూర్వం వంశపారంపర్యంగా వచ్చే గ్రామ సేవకుల పోస్టులు కూడా మారిన ప్రభుత్వ విధానాలతో అందకుండా పోయాయి. మరోవైపు చాలా కాలంగా దళితులకు అసైన్డ్ భూములు ఇవ్వడం లేదు. దీంతో, దళితులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురికావాల్సివస్తోంది. ఫలితంగా కులవివక్ష, రాజకీయ వేధింపులు చవిచూడాల్సిన దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో దళితులకు విరివిరిగా అసైన్డ్ భూములు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పటికే సాగులోవున్న భూములకు పట్టాలిచ్చి చేతులు దులుపుకునేందుకు, ఎన్నికల వేళ గట్టి ప్రచారం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. భూమిలేని పేద దళిత కుటుంబాలు సాగు ద్వారా జీవనం పొందేందుకు ప్రభుత్వ భూమి ఇవ్వాల్సివుంది. ఇది చాలా కాలంగా అమలు కావడం లేదు. దీంతో, నాటి టిడిపి, నేటి వైసిపిలపై దళితుల్లో వ్యతిరేకత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వీరికి అసైన్డ్ ల్యాండ్ ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటికే సాగులోవున్న అసైన్డ్ భూములకు సాగుపట్టాలు ఇవ్వడం, అసైన్డ్ భూమి పొంది 30ఏళ్లు దాటినవాటిని రెగ్యులర్ చేయడం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో ఇచ్చిన భూములపై మార్టుగేజ్ ఎత్తివేత వంటి చర్యలతో సరిపెడుతోంది. దీనివల్ల దళితులకు అదనంగా ఒరిగేదేమీ లేదు సరికదా ఇప్పటికే చేతులు మారిన అసైన్డ్ ల్యాండ్ పెత్తందారులు, రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం కనిపిస్తోంది. 2003 నాటికి ముందు విజయనగరం జిల్లా వ్యాప్తంగా సుమారు 30వేల ఎకరాల సాగు భూములు దళితులకు ఇచ్చినట్టుగా అధికార యంత్రాంగం గుర్తించింది. ఇందులో ప్రస్తుతం సంబంధిత రైతుల సాగుతోపాటు వెబ్ ల్యాండ్‌లోనూ సంబంధిత వివరాలు ఉన్నవి 6,300 ఎకరాలు మాత్రమేనట. దీన్నిబట్టి మిగిలిన భూమంతా చేతులు మారిందని, దళితుల బలహీనత, ఆర్థిక అవసరాలను ఆధారంగా చేసుకుని చట్టానికి విరుద్ధంగా పెత్తందారులు, కాస్త ఆర్థికంగా, రాజకీయంగా అవకాశం ఉన్నవారు వశపర్చుకున్నారని అర్థమౌతోంది. మరోవైపు ఇలా గుర్తించిన 6,300 ఎకరాలు కూడా వాస్తవంగా దళితుల చేతుల్లోనే ఉన్నాయా? లేక రాజకీయ పలుకుబడితో దళితుల చేతుల్లోకి వచ్చాక వశపర్చుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తున్నారా? అన్నది తేలాల్సివుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో కొత్తగా 1336 మందికి డి-పట్టాలు ఇచ్చేందుకు అధికార యంత్రాంగం గుర్తించింది. కానీ, ఇవేవీ కొత్తగా ఇస్తున్నవి మాత్రం కాదు. చాలా ఏళ్లగా దళితుల సాగులోవున్న భూములను గుర్తించి, వాటినే కొత్తగా రైతులకు పంపిణీ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. ఈ విధంగా రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ నియోజకవర్గం చీపురుపల్లిలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్నాయి. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 216 మందికి గతంలో ఇచ్చిన భూములను కూడా రెగ్యులర్ చేయనున్నారు. వాటిపైవున్న స్మార్ట్ గేజ్ తొలగించేందుకు నిర్ణయం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి చాలా మండలాల్లో ఇప్పటికే భూమి చేతులు మారింది. వీటిని దళితులకు ఏ విధంగా అప్పగిస్తారో? తీరా అప్పగించాక దళితులపై ఎలాంటి ఒత్తిళ్లు మొదలవుతాయో వేచి చూడాల్సిందే. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ మూడు పద్ధతుల్లోనూ డిసెంబర్ మూడులోపు పట్టాలు ఇచ్చేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందుకనుగుణంగా ఇప్పటికే ఆయా భూములకు సంబంధించి 22ఎ ను, మార్టిగేజ్‌లను ఎత్తివేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఇంకా అవసరమైన చోట భూమిని కూడా సేకరిస్తామని చెబుతున్నారు

చిన్నపరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- నెల్లిమర్ల పారిశ్రామిక పార్కులో రూ.6.46 కోట్లతో వసతుల కల్పన : సిఎం
- పూసపాటిరేగ, ఎల్.కోట మండలాల్లో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అత్యధిక ప్రోత్సాహాన్నిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామిక వేత్తలు ఎలాంటి సమస్య వున్నా ఒక ఫోన్‌కాల్ చేస్తే వాటిని పరిష్కరించే పరిస్థితి ఏర్పడాలన్నారు. రాష్ట్రంలో ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు వర్చ్యువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఫిబ్రవరిలో పరిశ్రమలకు ప్రభుత్వం మంజూరు చేయాల్సిన రాయితీల విడుదలకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర స్థాయి పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటైన ఆహారశుద్ధి(ఫుడ్ ప్రాసెసింగ్) పరిశ్రమలను ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చ్యువల్‌గా ప్రారంభించారు. దీనిలో భాగంగా పూసపాటిరేగ మండలం కోనాడలో బ్లూఫిన్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో రూ.13 కోట్లతో ఏర్పాటు చేస్తున్న నూడిల్స్, పాస్తా, సేమియా, పొటాటో చిప్స్, చిరుధాన్యాల ఆధారిత ఆహార ఉత్పత్తులు తయారుచేసే పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 45 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతో పాటు చిరుధాన్యాలు పండించే వంద మంది ఈ ప్రాంత రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుందనికలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ఎల్.కోట మండలం రేగ గ్రామంలో జైకిసాన్ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేసిన నువ్వులతో ఆహార ఉత్పత్తులు రూపొందించే ఆహారశుద్ధి ప్లాంట్‌కు ముఖ్యమంత్రి వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. నువ్వుల నూనెతో పాటు, చిక్కీలు తయారుచేసి అందించే విధంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో వున్న నువ్వులు పండించే రైతులకు ఈ ప్లాంటు ఏర్పాటు ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ చెప్పారు. నెల్లిమర్లలోని ఎపిఐఐసి పారిశ్రామిక పార్కులో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.6.46 కోట్లతో చేపట్టనున్న మౌలిక వసతులు, సుందరీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక పార్కులో ఇప్పటికే వున్న పరిశ్రమలకు అవసరమైన వసతులు కల్పించడం, కాలువలు, అంతర్గత రోడ్లు, గార్డెనింగ్ తదితర పనులను చేపట్టనున్నట్టు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఆయా పరిశ్రమల ఏర్పాటు కోసం ఉద్దేశించిన శిలాఫలకాలను కలెక్టర్ ఆవిష్కరించారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమం లో పరిశ్రమల జిల్లా అధికారి పాపారావు, బ్లూఫిన్ పరిశ్రమ ప్రతినిధి ఆర్.గణపతిరావు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పరిశ్రమలశాఖ అధికారి పాపారావు

మూడు రోజుల్లో వరికోతలు పూర్తి చేసుకోవాలి

వ్యవసాయశాఖ జెడి విటి రామారావు

ప్రజాశక్తి-విజయనగరం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు మూడురోజుల్లో వరికోతలు పూర్తి చేసుకోవాలని వ్యవసాయశాఖ జెడి విటి రామారావు తెలిపారవు. ఈమేరకు ఒక ప్రకటనలో రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఖరీఫ్ కాలానికి వరి పంట 231835 ఎకరాలలో సాగవ్వగా, నేటి వరకు 1,21,999 ఎకరాలలో (53శాతం) వరి కోతలు పూర్తయ్యాయని తెలిపారు. వాతావరణ శాఖ నివేదికల ఆధారంగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం డిసెంబర్ 2న తుపానుగా మారనుందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో, కోస్తాంధ్ర, రాయలసీమల్లోని పలు జిల్లాల్లో అధిక వర్ష సూచన ఉన్న నేపథ్యంలో, కోతకు వచ్చిన వరి పంటను వెంటనే కోసి భద్రపరచు కోవాలని తెలిపారు. ఈ మూడు రోజులు దాటితే రైతులు ఒక వారం రోజుల పాటు తుపాను తీవ్రత తగ్గే వరకు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈనెల 4 నుంచి 6వరకు తుపాను హెచ్చరికల నేపథ్యంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కోసి ఉంచిన వరి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు.

యంత్రాల ద్వారా కోత కోసుకునేవారు డిసెంబర్ 2లోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. కూలీలతో ద్వారా కోత కోయడాన్ని వాయిదా వేసుకోవాలని, పనలపై ఉన్న పంటను సమీపంలో గల కళ్లాల్లో గాని, ఖాళీ భవనాల్లో గాని భద్రపరుచు కోవాలని తెలిపారు. వరి కుప్పలపై వీలైనంతవరకు టార్పాలిన్‌లు కప్పి ఉంచాలన్నారు. ప్రత్తి పంటలో చిన్నపాటి కాలువలు తీసుకుంటే నీటిని బయటకు పంపవచ్చునని తెలిపారు. మొక్కజొన్న గింజలను లేదా కంకులను సురక్షిత ప్రాంతాలలో పరదాలు కప్పి ఉంచాలని సూచించారు.

ఓటింగ్ ప్రభావిత అంశాలను గుర్తించండి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటింగ్ ప్రక్రియకు అవరోధం కలిగించే వ్యక్తులను, ప్రాంతాలను, గ్రామాలను, పోలింగ్ స్టేషన్లను , నియోజకవర్గాల వారీగా గుర్తించి మాపింగ్ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల క్యాలెండరు ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్‌కు 6 నెలల ముందు నుండే సంసిద్ధతపై పలు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని, అందులో భాగంగానే మాపింగ్ పై శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మాపింగ్ పై సెక్టరల్ అధికారులకు, సెక్టరల్ పోలీస్ అధికారులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత ఎన్నికలకు తక్కువ సమయం ఉంటుంది కావునా ముందే ఈ సంసిద్ధతా కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని అన్నారు. వల్నరబిలిటి ని ముందుగా అర్థం చేసుకోవాలని, పోల్ డే, ప్రీ పోల్ డే, పోస్ట్ పోల్ బాధ్యతలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఓటర్లను భయ భ్రాంతులకు గురి చేసే అంశాలను, వత్తిడిని పెంచే అంశాలు, గత సంఘటనలు, రాజకీయ పక్షాల తీరు, ఓటర్ల కులంపై ప్రభావితం, బైండోవర్ కేసులు, ఆయుధాల డిపాజిట్, మైగ్రేటేడ్ పాపులేషన్ , మరీ ఎక్కువ, మరీ తక్కువ శాతం ఓటింగ్ అయిన పోలింగ్ బూత్ లు వీటన్నిటి వివరాలను నిర్దేశిత ఫార్మాట్ లలో రూపొందించి పంపాలన్నారు. వీటి ఆధారంగానే ఎన్నికల సిబ్బంది, పోలీస్ డిప్లాయ్మెంట్ ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 5,6 తేదీలలో అన్ని నియోజకవర్గాల్లో జాయింట్ తనిఖీ చేసి 6వ తేదీన నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ నివేదికలు పంపేటప్పుడు పోలీస్, రెవిన్యూ, ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం ఉండాలని అన్నారు.

జిల్లా ఎస్.పి దీపిక మాట్లాడుతూ స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ కోసం వల్నరబిలిటి మాపింగ్ చేయాలని, హెచ్‌సి నుండి ఆ పైన ఉన్న కేడర్ వారిని సెక్టోరల్ అధికారులుగా నియమించామని తెలిపారు. ఒక్కో సెక్టారుకు 10 నుండి 12 పోలింగ్ స్టేషన్లు ఉంటాయని తెలిపారు. గత 5 ఎన్నికలలో జరిగిన ఘటనల ఆధారంగా పరిశీలించాలని, మహిళా పోలీస్ సహకారాన్ని కూడా తీసుకోవాలని తెలిపారు. వల్నరబిలిటి మాపింగ్ పై మెప్మా పీడీ సుధాకర్, వన్ టౌన్ సిఐ బెండి వెంకట రావు పవర్ పాయింట్ ద్వారా శిక్షణలో వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ అనిత, రెవిన్యూ, పోలీస్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

ఐదు రోజులు నల్లబ్యాడ్జీలతో విధులకు

8 నుంచి అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

డిసెంబర్ 1 నుంచి 5 వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, 6న అంబేద్కర్ విగ్రహాలకు వినతినిస్తామని ప్రభుత్వం స్పందించకుంటే డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం పూల్ బాగ్ 2వ సెక్టార్, బొందుల గూడెం 3వ సెక్టార్ సమావేశాల సందర్భంగా వారు మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మొండిగా వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తామని చెప్పి నేడు మాట మార్చారని చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత ధరల్లో మెనూ చార్జీలు సరిపోవని, అంగన్వాడి సెంటర్లకు కరెంట్ బిల్లులు వేలల్లో వస్తుంటే ప్రభుత్వం రూ. 200 ఇచ్చి సరిపెడుతుందన్నారు. 2014 నాటి బకాయిలను, సర్ చార్జీలు, సర్దుబాటు ఛార్జీల భారం ఎలా భరించగలమని ప్రశ్నించారు. తెలంగాణ, కర్ణాటక, గుజరాత్ మాదిరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు.. ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు డిసెంబర్ ఒకటి నుంచి ఐదు వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, డిసెంబర్ 6న అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రంలో ఇస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ 8 నుంచి 21 సమ్మెకు సిద్ధం కాబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు శివలక్ష్మి, సునీత, ప్రసన్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ ఆహ్వానపు పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 19, 20, 21 తేదీలలో రాష్ట్రస్థాయి మహిళ ఆహ్వానపు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ మహిళా ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం మహిళా పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలు వివరాలను ప్రకటించారు. డిసెంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు మహిళా పార్కులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 టీములు పాల్గొనే అవకాశం ఉందని అన్నారు. గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు అవార్డుల రూపేణా బహుమతులను అందజేస్తామని తెలిపారు. పోటీలకు విచ్చేసిన టీములకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ వాణిశ్రీ, అసోసియేషన్ ప్రతినిధులు ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, వరలక్ష్మి, కనకమహాలక్ష్మి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 1న ఉదయం 9.30నుండి మధ్యాహ్నం 1 గంట వరకు 132/33 కెవి ఒంటితాడి సబ్ స్టేషన్‌లో మరమ్మతు ప నులు, చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఎపి ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి వుడా ఫీడర్ మీద ఉన్న పాత జిల్లా కోర్ట్ ఏరియా, ప్రదీప్ నగర్, సిబి కాలనీ, అలకానంద కాలనీ, బొగ్గులదిబ్బ, ఎల్‌బి కాలనీ, షాలిమార్ హోటల్, వివేకానంద కాలనీ, గోకపేట, ఆదిత్య నగర్, సూర్య నగర్, వివేకానంద కాలనీ, 11 కెవి విజయనగరం టౌన్ ఫీడర్ ఉన్న ఆర్టీసి జోనల్ వర్క్ షాప్, ప్రదీప్ నగర్, వైఎస్ఆర్ నగర్, 11 కెవి కోరుకొండ ఫీడర్ మీద ఉన్న విటి అగ్రహారం, రొంగలి వీధి, పెద్ద వీధి, ప్రియా నగర్, డి.మార్టు, గాంధీనగర్, వై జంక్షన్, దుర్గా నగర్ , ఆదర్శ నగర్, ప్రసాద్ నగర్, కొత్త మజ్జిపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కేంటీన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి

జిల్లా కోర్టు వద్ద కేంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

పూల్‌బాగ్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి బుధవారం ప్రారంభించారు. కక్షిదారులకు, న్యాయవాదులకు ఈ క్యాంటీన్ ఉపయోకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు జి.రజని, షేక్ భాషా, పద్మావతి, బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు, క్యాంటీన్ నిర్వాహకులు డాక్టర్ పైల రమేష్, గేదెల సత్యం పాల్గొన్నారు.

వికలాంగులకు డిజిటలైజేషన్ విద్య

విజయనగరం : డిజిటలైజేషన్ విద్య వికలాంగులకు ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర సమగ్రశిక్షా సహితవిద్య విభాగం రిసోర్స్ పర్సన్లు డాక్టర్ వై. నరసింహం, డాక్టర్ ఎన్.అమ్మినాయుడులు అన్నారు. విజన్- 2025లో భాగంగా ఇటీవల జిల్లా లోని దృష్టి, వినికిడి లోపం గల 209 మంది వికలాంగ విద్యార్థులకు సమగ్రశిక్షా ద్వారా ట్యాబ్‌లను అందజేశారు. బుధవారం డిఆర్‌డిఎ కార్యాలయిలో డిజిటల్ సాధనాల ద్వారా విద్యా బోధనపై సమగ్రశిక్షా, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఇఆర్‌పిలకు శిక్షణ నిర్వహించారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వికలాంగ విద్యార్థులకు డిజిటల్ సాధనాల ద్వారా విద్యను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వికలాంగలకు ట్యాబులను అందజేసినట్లు చెప్పారు. జిల్లా సహిత సమన్వయకర్త ఎస్. సూర్యారావు, సహా సమన్వయకర్త ఎం. భారతి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2, 3న ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి-విజయనగరం

ఓటరు చేర్పులు, మార్పులకోసం డిసెంబర్ 2,3 తేదీలలో ప్రత్యేక కాంపెయిన్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలెక్టర్ సమ్మరీ రివిజన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 2,3 తేదీలలో బూత్ స్థాయిలో స్పెషల్ కాంపెయిన్ నిర్వహిస్తామన్నారు.ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు బిఎల్‌ఒలు బూత్ వద్ద ఉంటారని,జాబితాలను సారి చూసుకోవాలని తెలిపారు. ఈనెల 22 నుండి 28 వరకు వారం రోజుల్లో ఫారం 6 లు చేర్పుల కోసం 3516 , ఫారం 7 తొలగింపుల కోసం 3433 , ఫారం 8 కరెక్షన్ కోసం 3679 మొత్తం 10628 దరఖాస్తులు అందాయని తెలిపారు. 18, 19 ఏళ్ళ వయసు గల ఓటర్ల తక్కువ సంఖ్యలో ఉన్నందున 17 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లు గా చేర్పించేందుకు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లతో వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడడం జరిగిందని తెలికిపారు. వారి నుండి స్పందన బాగుందని తెలిపారు. ఓటర్లకు 1 లక్ష 3 వేల ఎపిక్ కార్డులను జనరేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే చాలా వరకు డిస్పాచ్ చేసామని తెలిపారు. ఈ రెండు రోజులు పాటు నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఓటర్లంతా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

సమావేశంలో డిఆర్ఒ అనిత, ఇఆర్ఒలు వెంకటేశ్వరరావు, దొర, వైసిపి నుండి రొంగలి పోతన్న, టిడిపికి చెందిన కిమిడి నాగార్జున, ఐవిపి రాజు, ఆప్ ప్రతినిధి దయానిధి, బిఎస్‌పి నుండి సోములు , కాంగ్రెస్ నుండి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతతో ఓటర్ల వెరిఫికేషన్ చేయాలి : టిడిపి

విజయనగరం కోట : జిల్లాలో ఓటర్ల వెరిఫికేషన్ పూర్తి స్థాయిలో పారదర్శకతతో చేయాలని, మరణించిన వారి ఓట్ల తొలగింపు, డబుల్ ఎంట్రీలు, వలసవెళ్లిన వారి ఓట్లను పూర్తిగా తొలగించాలని టిడిపి నాయకులు కలెక్టర్ నాగలక్ష్మిని కోరారు. ఈమేరకు బుధవారం టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు కొండపల్లి అప్పలనాయుడు , కోళ్ల లలిత కుమారి, కర్రోతు బంగార్రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కలెక్టర్‌కు వినతినిచ్చారు. ఇదే అంశంపై విజయనగరం నియోజకవర్గం తరపున పార్టీ ప్రధాన కార్యదర్శి ఐ వి పి రాజు, పార్టీ కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు కూడా వినతినిచ్చారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహిళలు సమాజంలో స్వయం శక్తితో ఎదగాలని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ విజయ్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బి బంగ్లా కంటోన్మెంట్ విజయనగరం థెరిసా క్లబ్‌లో కుట్టు మిషన్లు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీలకు సంబంధించిన కుట్టు మిషన్లు ట్రైనింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ ఇస్తున్న థెరిసా క్లబ్‌ను అభినందించారు. బ్యాంకుల సహకారంతో ముద్ర రుణాలు ఇస్తామన్నారు. థెరిసా క్లబ్ జాయింట్ సెక్రటరీ విజయకుమార్ మాట్లాడుతూ 1989 నుంచి మహిళల అభివృద్ధికి క్లబ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెరిసా క్లబ్ ఫౌండర్ కెటి కొరియా కోస్, సెక్రెటరీ శ్రీనివాసరావు,ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్ వి రావు పాల్గొన్నారు.

కాఫీ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పర్యావరణానికి హాని కలగని వాటిని ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత కోరారు. స్థానిక ఉడా కాలనీ ఫేస్ -3 ఆర్ఆర్ ఎబిలిడి కాఫీ షాప్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇక్కడ కాఫీ తో పాటు వారిచ్చే టీ కప్పు కూడా తినేయడానికి ఎంతో బాగుంటుందని, దీనివల్ల ఎటువంటి పర్యావరణం హాని కలగకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో షాప్ యాజమాని దాట్ల రవిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ త్రినాథ్, గంట్యాడ మండలం టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కరరావు, ఎస్ఎన్ఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రేషన్ అందివ్వాలి

ప్రజాశక్తి - గజపతినగరం

ప్రతి ఇంటికీ రేషన్ అందివ్వాలని సిఎస్‌డిటి డివి రవిశంకర్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చౌక ధర దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి రేషన్ ఇచ్చి జీపిఎస్ ప్రొఫార్మా రాసుకోవాలని అన్నారు. ఏరోజుకారోజు అమ్మిన నగదును ఎండిఎం ఆపరేటర్లు డీలర్లకి అంది ఇవ్వాలని సూచించారు. సరుకు బదిలీ చేసినప్పుడు డీలర్లు కూడా దుకాణం వద్ద అందుబాటులో ఉండాలని, ఎమ్.ఎల్.ఎస్ పాయింట్ దగ్గర వేలిముద్ర వేసి సరుకు తెచ్చుకోవాలని తెలిపారు. దుకాణదారుల పట్టికలో ఎప్పటికప్పుడు విడిగా సరుకులు వివరాలు రాసి పెట్టాలని అన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

వేపాడ: మండలంలోని బొద్దాం కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణను బుధవారం ఎంఇఒ 1 జి. జగదీష్ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం, లెక్కలు చతుర్విధ ప్రక్రియలు చేయడం రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్క్ బుక్స్ విద్యార్థులు పూర్తి చేసినప్పుడు వాళ్లకు అర్థమయ్యే రీతిలో పూర్తి అవగాహన కలిగే విధంగా ప్రాక్టీస్ చేయించాలన్నారు. కాగా ఎంఇఒ -2 బాల భాస్కరరావు వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరుగుతున్న లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఛైర్మన్ ఎస్‌ఎస్ వల్లి, వేపాడ, ఎల్‌కోట మండలాల గణిత ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

పలుచోట్ల పంటకోత ప్రయోగాలు

శృంగవరపుకోట: ప్రధానమంత్రి ఫసల్, వైఎస్ఆర్ పంటల బీమా యోజనలో భాగంగా వరి పంట కోత ప్రయోగాలను నిమిత్తం బుధవారం మండలంలోని కాపుసోంపురం, పోతనపల్లి గ్రామాలలో నిర్వహించారు. ఈ పంట కోత ప్రయోగాలను జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి పి బాలాజీ పర్యవేక్షించారు. 5x5 ప్లాట్ దిగుబడి కృష్ణాపురంలో 11.820 కిలోలు, కాపుసోంపురంలో 13.180 కిలోలు సాధారణ దిగుబడి వచ్చిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల గణాంక అధికారి ఎస్‌కోట రాజు, వ్యవసాయ సహాయకులు సుమా, కోట లక్ష్మి, విఆర్‌ఎ శివాజీ, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారి రామారావు

రైతు పథకాలపై అవగాహన

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి గ్రామంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. టి. రామారావు పాల్గొని కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డ్స్, పసల్ బీమా, కిసాన్ డ్రోన్స్ వనిటీ పథకాలు కోసం రైతులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస ఎడిఎ ఎల్. విజయ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తొలగింపు ఓట్లపై దృష్టిసారించండి

శృంగవరపుకోట: తొలగించిన ఓట్లపై దృష్టి సారించాలని తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఇఆర్ఒ సుదర్శన్ దొరకు టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి సూచనల మేరకు ఇదివరకే డబుల్ ఎంట్రీ, 'సున్నా' ఇంటి నెంబర్, ఒకే ఇంట్లో పది కన్నా ఎక్కువ ఓట్లు, అవకతవకలు కలిగిన ఓట్లు మొదలైన వాటి మీద సమగ్ర సర్వే చేయించాలని కోరారు. వీటన్నింటినీ జనవరిలో రాష్ట్ర ఎలక్షన్ ముసాయిదా కమిటీ విడుదల చేసే లోపు ఎస్.కోట నియోజకవర్గంలోని ఓట్లను సరిచేయాలని కోరామన్నారు.

పేదల ఆకలి తీర్చడమే అన్న కేంటీన్ లక్ష్యం

శృంగవరపుకోట: పేదలి ఆకలిని తీర్చడమే లక్ష్యంగా పట్టణంలోని 119వ రోజు అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట, అన్న క్యాంటీన్ నిర్విరామంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో సాగుతోందన్నారు. బుధవారం మధ్యాహ్నం వచ్చిన 300 మంది పేదవారికి ఈ సందర్భంగా ఆమె ఉచితంగా ఉచితంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో విశాఖ టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, చక్కా కిరణ్ కుమార్, వాకాడ బాల ఈశ్వర్ భరత్ (బాలు), పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), యువత భీశెట్టి మోహన్ కుమార్, బుత్తల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో సహస్ర సందడి

బాడంగి : చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు, జిల్లా పరిషత్తు ఛైర్మన్ కుమార్తె మజ్జి శిరి సహస్ర మండలంలోని వాడాడ గ్రామంలో గొట్టాపు రామారావు, మరిపి గాంధీ పంట పొలాల్లో బుధవారం సందడి చేశారు. వరి కోతలు కోస్తున్న రైతులతో మమేకమై వరి పంట కోసి, తాను స్వయంగా ట్రాక్టర్‌ను నడుపుతూ, రైతులతో కలిసి భోజనం చేస్తూ రైతుల కష్ట, సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తోట వాసు, జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, గొట్టాపు శివ, గంట సతీష్, జగదీష్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ స్థలంలో ఇచ్చిన పట్టాలు రద్దుచేయాలి

బొబ్బిలి: గొల్లపల్లి శ్రీదాడితల్లి కాలనీలో దాడితల్లి కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో ఇచ్చిన పొజిషన్ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ భవానీ, అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు ఆందోళన చేశారు. దాడితల్లి కాలనీలో కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ బుధవారం కళ్యాణ మండపం స్థలం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, గ్రామస్తులు మాట్లాడుతూ దాడితల్లి కాలనీలో కళ్యాణ మండపం కోసం రిజర్వ్ స్థలం కేటాయిస్తే ఆస్థలంలో పొజిషన్‌లో లేనప్పటికీ రాజకీయ ఒత్తిడితో పొజిషన్ పట్టాలు ఇస్తున్నారన్నారు. కళ్యాణ మండపం స్థలంలో ఇచ్చిన పొజిషన్ పట్టాలు రద్దు చేయాలని, ఇక నుంచి పొజిషన్, ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ, ఇంజినీరింగ్ సిబ్బందితో బుధవారం ఎంపిడిఒ రామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు -నేడు సెకెండ్ ఫేజ్‌లో భాగంగా 43 అంగన్వాడీ కేంద్రాలు ఎంపికైయ్యాయన్నారు. వాటికి సంబంధించి ఏడుగురు సభ్యులతో కూడిన తీర్మాణాలు, బ్యాంకు ఖాతాలను త్వరగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఒ రాజ్యలక్ష్మి, నాడు -నేడు ఎఇ కిషోర్, మండల పరిషత్ పరిపాలన అధికారి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు వెంకట్ లక్ష్మి, ఉషారాణి పాల్గొన్నారు.

అలరించిన గురజాడ పాఠశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: గురజాడ వర్థంతి సందర్భంగా బుధవారం స్థానిక గురజాడ పాఠశాలలో గురజాడ వేష ధారణ ఫ్యాన్సీ డ్రస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎల్ కెజి నుండి 5 వ తరగతి వరకు 50 మంది విద్యార్థులు గురజాడ వేషధారణ పోటీలో పాల్గొన్నారు. ఈ వేషధారణలో పాల్గొన్న విద్యార్థులందరికీ జెవివి అధ్యక్షులు, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, పాఠశాల కరస్పాండెంట్ ఎం. స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, స్కూల్ ఎఒ ఏఎన్ నాయుడు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా హై స్కూలు విద్యార్థులందరికీ గురజాడ అప్పారావు జీవిత చరిత్ర పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

బెంగళూరులో ఈ నెల 22 తేదీ నుండి 26 తేదీ వరకు జరిగిన 28వ జాతీయ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్‌లో విజయనగరానికి చెందిన ఎస్. జార 69 కేజీల మహిళా విభాగంలో 90 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు బుధవారం ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వేపాడ మండలం కొంపల్లిలో బుధవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి మినీ మేనిఫెస్టో గురించి వృద్ధురాలికి వివరించారు.

- ప్రజాశక్తి, వేపాడ

జోరుగా నిషేధిత బిటి-3 పత్తి సాగు

- సాగుతో పర్యావరణానికి ముప్పు
- విత్తనాల కోసం ప్రోత్సాహం
- పత్తి ఆకులు తిని ఆరు మేకలు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన బిటి-3 పత్తి రామభద్రపురం మండలంలో గప్ చుప్‌గా సాగు చేస్తున్నారు. ఈ పత్తి సాగు వల్ల పర్యావరణానికి ముప్పు కలగడంతో పాటు సాగు భూములు బీడు భూములుగా మారే అవకాశం ఉండడంతో బిటి-3 పత్తి సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వలేదు. ఈ పత్తి వల్ల విత్తన మాఫియాకు అధిక లాభాలు రావడంతో రామభద్రపురం మండలంలోని కొన్ని గ్రామాలను విత్తన మాఫియా ఎంపిక చేసుకుని రైతులకు విత్తనాలు, పెట్టుబడి నిధి ఇచ్చి సాగును ప్రోత్సహిస్తున్నారు. బిటి-3 పత్తి సాగు చేస్తే తామే అధిక ధరలకు కొనుగోలు చేస్తామని గుంటూరు ప్రాంతానికి చెందిన విత్తన మాఫియా రైతులకు చెప్పడంతో సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. బిటి-3 పత్తి సాగు చేస్తున్నట్టు రామభద్రపురం మండల వ్యవసాయ శాఖాధికారికి తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రైతులకు నిషేధిత పత్తి విత్తనాలు ఇచ్చి సాగు చేపించి ఆ పత్తిని రైతుల నుంచి విత్తన మాఫియా కొనుగోలు చేసి విత్తనాలు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

బిటి-3 పత్తి సాగుతో పర్యావరణానికి హాని

బిటి-3 పత్తి సాగు చేస్తే పర్యావరణానికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ విత్తనాలు నాటిన వెంటనే మొక్కలు రాకముందే కలుపు మందు గ్లైఫోసేట్ పిచికారీ చేయాలి. గ్లైఫోసేట్ మందు పిచికారీ చేయడం వల్ల కలుపు మొక్కలు చనిపోతాయి. ఈ గ్లైఫోసేట్ మందు వల్ల జన్యు పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీని వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని శాస్త్రవేత్తలు గుర్తించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిటి-3 పత్తి సాగుకు అనుమతులు ఇవ్వలేదు.

తగ్గనున్న మదుపులు

బిటి-3 పత్తి సాగు వల్ల కలుపు ఖర్చులు తగ్గుతాయని సాగు చేసేందుకు రైతులు మొగ్గ చూపుతున్నారు. పత్తిలో రెండుసార్లు కలుపు తీయాలి. కలుపు నివారణకు గ్లైఫోసెట్ రసాయనిక మందు పిచికారీ చేసే ఎకరానికి రూ. వెయ్యి లోపు ఖర్చవుతుంది. గ్లైఫోసెట్ రసాయనిక మందును కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయి. బిటి-3 పత్తి సాగును ప్రోత్సహించేందుకు రైతులతో గ్లైఫోసెట్ కొనుగోలు చేయించి విత్తన మాఫియా సొమ్ము చేసుకుంటుంది.

కోటశిర్లాంలోని బిటి-3 రకం పత్తి సాగు

500 ఎకరాల్లో సాగు?

రామభద్రపురం మండలంలోని సుమారు 10 గ్రామాల్లోని 500 ఎకరాల్లో బిటి-3 పత్తి సాగు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కోటశిర్లాం పంట పొలాలను ప్రజాశక్తి విలేకరి పరిశీలించగా బిటి-3 పత్తి సాగును గుర్తించారు. ఆడ, మగ పత్తిని పక్కపక్కనే ఉన్న పొలాల్లో రైతులు సాగు చేసి మగ పువ్వును తెంచి ఆడ పువ్వుతో క్రాసింగ్ చేసి బిటి-3 పత్తి సాగు చేస్తున్నారు. కోట శిర్లాం, పాడివానివలస, కొండకెంగువ తదితర ఏడు గ్రామాల్లో బిటి-3 రకం పత్తి సాగు చేస్తున్నట్లు అక్కడ రైతులు చెబుతున్నారు.

ఇదీ రైతులు మోసపోతున్న విధానం

ముఖ్యంగా రైతులు బిటి-3 (గ్లైసిల్) విత్తనాలు ఉపయోగించడానికి ఆసక్తి చూపిస్తున్న ప్రధాన కారణం కలుపు మొక్కలు తీసే పని లేకపోవడమే. గడ్డి గ్లైసిల్ విత్తనాలు ఉపయోగించడం వల్ల మొక్క ఎదుగుతున్న క్రమంలో పంటలో వస్తున్న కలుపు, గడ్డిని పారద్రోలడానికి కూలీలను పెట్టుకొని కలుపు తీసివేయవలసిన పని లేకుండా పోతుంది. దీంతో ఖర్చు కూడా తగ్గుతుంది. ఈ గ్లైసిల్ విత్తనాలు ఉపయోగించేవారు గ్లైఫోసెట్ (నిషేధ గడ్డిమందు)ను ఉపయోగిస్తే గడ్డి మాత్రం చచ్చి పోయి చెట్టుకు ఎలాంటి నష్టం ఉండదు.

సాగుకు సహకరిస్తున్న ఎఒ

రామభద్రపురం మండల వ్యవసాయ శాఖాధికారి బిటి-3 సాగుకు, విత్తన మాఫియాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విత్తన మాఫియా నుంచి కొంత మొత్తం తీసుకుని మిన్నకుండి చూస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పత్తి సాగుపై సమగ్ర విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బిటి-3 పత్తి సాగు చేస్తే క్రిమినల్ కేసులు

నిషేధిత బిటి-3 పత్తి సాగు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్ చెప్పారు. బిటి-3 పత్తి సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వలేదన్నారు. రామభద్రపురం మండలంలో పత్తి సాగు చేస్తున్న విషయం తనకు తెలియదని సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆరు మేకలు మృతి

కొన్ని రోజులు క్రితం బిటి-3 పత్తి ఆకులు తిని పాడివానివలస గ్రామం ఒక మేకల కాపరికి చెందిన వే ఆరు మేకలు మృతి చెందినట్లు తెలిసింది. నిషేధిత పత్తి ఆకులు తింటే జీర్ణవ్యవస్థ పాడై జంతువులైనా, పశువులైనా మరణించే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాల పట్టిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల పట్టికను బుధవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టి పాల లక్ష్మి, వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ వాకాడ రాంబాబు, ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఎస్ కోట వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, పోతనపల్లి ఎంపిటిసి వెంకటరావు, రాకోటి సాదు సన్యాసిరావు, వెంకట్రావుపేట సర్పంచ్ కోటి బాబు, పాల్గొన్నారు. **బొబ్బిలి:** బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు బుధవారం మున్సిపాలిటీ పరిధిలో గల 7వ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ గొలగాని రమాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, పట్టణ జె.సి.యస్ కన్వీనర్ రేజేటి ఈశ్వర్ రావు, మున్సిపల్ టిపిఒ వర ప్రసాద్, టిపిఆర్ఒ జగన్మోహన్‌రావు, వైసిపి నాయకులు పూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** మండలంలోని బానాదిలో బుధవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనా యుడు, డిసిసిబి ఛైర్మన్ వి.వి.చిన రామునాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ కస్తూరి, కోపరేటివ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి నాయుడు, సర్పంచ్ కర్రీ యశోద, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, నాయకులు బీల సతీష్ పాల్గొన్నారు. **గజపతినగరం:** సంక్షేమం అభివృద్ధికి చిరునామ వైసిపి అని ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. బుధవారం మండలంలోని పాతబగ్గం గ్రామంలో జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడి రాజు, జెసియస్ కన్వీనర్ కనకాల సుబ్రమణ్యం పాల్గొన్నారు. **బొండపల్లి:** ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆలోచించి ఓటు ద్వారా గెలిపించాలని ఎంపిపి చల్ల చలం నాయుడు అన్నారు. బుదవారం ముద్దూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మునకాల పైడిపునాయుడు అద్యక్షతన ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు కావలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యం

జిల్లా అధ్యక్షులు వెంకటేష్

ప్రజాశక్తి -పూసపాటిరేగ

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎస్ఎఫ్ఐ మండల మహా సభలు నిర్వహించారు ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970 నుంచి అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. గత సంవత్సర కాలంలో మన జిల్లాలో అనేక సమస్యల పైన చేసిన పోరాటాల్లో ఎస్ఎఫ్ఐ విజయాలు సాధిస్తూ వచ్చిందన్నారు. సైకిల్ యాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కారం చేసుకోవడానికి నిరాహార దీక్షలు చేసి అధికారులు సమస్యలను పరిష్కరించేలా చేశామని అది ఎస్ఎఫ్ఐ పోరాట తత్వానికి నిదర్శనమని కొనియాడారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించి నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నూతన మండల కమిటీని ఎన్నుకున్నామని చెప్పారు. డిసెంబర్ 16, 17 తారీకుల్లో ఇదే నియోజకవర్గంలో జరగనున్న ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలను విద్యార్థులు, ప్రజలు, మేధావులు జయప్రదం చేయాలని కోరారు.నెల్లిమర్లలో జరిగే ఈ మహాసభలకు ఈ మండలం నుంచి మండల మహాసభ ఎన్నుకోబడిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రఘు, మండల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అరాచక పాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి- దత్తి రాజేరు

వైసిపి అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల వల్ల అన్ని రంగాల ప్రజలూ ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ అరాచక పాలన కొనసాగకుండా అంతమొందించాలని మాజీ మంత్రి, జనసేన నాయకులు పడాల అరుణ పిలుపునిచ్చారు. బుధవారం కోమటిపల్లి గ్రామంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. వైసిపి పాలనలో భూ దందాలు, ఇసుక దోపిడీ, భూముల అక్రమ అమ్మకాలు, అక్రమ అప్పులు, నిరుద్యోగ సమస్య, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, ఉద్యోగులకు వేధింపులు, ప్రతిపక్షం పై కక్ష సాధింపు, పలు రకాల సమస్యలతో ప్రజల ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసి, దౌర్జన్యాలు చేసి, ఎలాగైనా అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యూహం పన్నుతున్నారని, దీన్ని ప్రజలంతా గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గజపతినగరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు మొనకాల జగన్ అధ్యక్షత వహించగా, పార్టీ నాయకులు గెద్ద రవి, గేదెల మంగమ్మ, మండల పార్టీ అధ్యక్షులు చప్ప అప్పారావు, జిల్లా రామారావు, కోమటిపల్లి వైస్ సర్పంచ్ వసంత శ్రీనివాసరావు, నాయకులు మామిడి దుర్గాప్రసాద్, విజయ్, గణేష్, గేదెల రామసత్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడాల అరుణ

పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కార్యాలయం ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

వెంకట పద్మ ఫౌండేషన్ ద్వారా ప్రముఖ చిన్నపిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు దంపతులు పేద ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. బుధవారం వెంకట పద్మ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కార్యాలయం, వెంకటపద్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద చిన్నారులు కోసం రూపొందించిన 20 ఉచిత బెడ్స్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులుగా ఎం.వెంకటేశ్వరావు, పద్మ కుమారి దంపతులు వారి వృత్తికే పరిమితం కాకుండా ఎన్నో ఏళ్ళుగా రోటరీ క్లబ్ ద్వారా, వెంకట పద్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. వచ్చే ఏడాదిలో రోటరీ గవర్నర్‌గా ఎం. వెంకటేశ్వరావు బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో కార్యాలయం ప్రారంభించడం, ఈ కార్యాలయం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయాలి అని ఆలోచన చేయడం హర్షించదగ్గ విషయం అని తెలిపారు. వెంకట పద్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద చిన్నారులు కోసం 20 ఉచిత బెడ్స్‌ని ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందించాలనే ఆలోచన రావడం శుభపరిణామం అని తెలిపారు. వైద్యులు వెంకటేశ్వరావు మాట్లాడుతూ పేద చిన్నారులు కోసం ఉచిత బెడ్స్‌ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఎప్పటినుండో ఉందన్నారు. జనరల్ వార్డులో 12 బెడ్స్ వైద్యం ఉచితంగా ఉంటుందని మందులు, రక్త పరీక్షలుకి మాత్రమే తల్లిదండ్రులు డబ్బులు కట్టుకోవాల్సి ఉంటుంది అని తెలిపారు. ఐసియు, ఎన్ఐసియులో ఎనిమిది బెడ్స్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. వీటి ఖరీదు ఒక్క బెడ్ రోజుకు ఆరు వేలు వరకు ఉన్న వాటిని కూడా ఉచితంగా అందిస్తామన్నారు. రోటరీ గవర్నర్‌గా వచ్చే ఏడాది బాధ్యతలు తీసుకుంటున్న తరుణంలో వచ్చే ఏడాది చేయాల్సిన సేవా కార్యక్రమాలు గురుంచి ఈ ఏడాది నుండే కార్యచరణ చేయాలని కార్యాలయం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రోటరీ సభ్యులు పాల్గొని డాక్టర్ వెంకటేశ్వరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

జీవనోపాధులు మెరుగు పరుచుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

స్వయం సహక సంఘంలో ఉన్న ప్రతి మహిళా జీవనోపాదులు మెరుగు పర్చుకొని వారి కాళ్ళ పై వారు నిలబడాలని డిఆర్‌డిఎ పీడీ కె.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎపియం, సిసి, విఒఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రతి మహిళ పొదుపు చేసేవిధంగా వైఎస్సార్ క్రాంతి పదం సిబ్బంది పని చేయాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 40 వేల స్వయం సహాయక సంఘాలకు రూ.1100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశామన్నారు. మరో రూ.200 కోట్లు స్త్రీనిధి రుణాలు మంజూరు చేశామన్నారు. 99 శాతం రికవరీ జరుగుతుందని ఆయన వివరించారు. పియంఇజిపి ద్వారా జీవనోపాదులు మెరుగు పర్చుకోవడం కోసం రూ.20 లక్షలు వరకు బ్యాంక్ గ్యారంటీతో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గతేడాది 500 యూనిట్లు, ఈఏడాది 1500 యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రుణాలు మంజూరు, రికవరీ పారదర్శకంగా జరిపేందుకు విఒఎల సియెస్‌పి ఖాతాలు నిర్వహణ పై అంతర్ గత ఆడిట్ నిర్వహణ చేపడుతున్నామని ఆయన చెప్పారు. రుణాల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మండలాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేసి మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యలు ఆర్థిక బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి సభ్యుల నుంచి రూ.310 వసూలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఎస్.కోట, గరివిడిలలో ఏర్పాటు చేశామని ఇంకా ప్రతి మండలంలో ఏర్పాటు చేసేందుకు వసూలు చేసిన నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిడి సావిత్రి, స్త్రీనిధి ఎజియం ఉమామహేశ్వరరావు, ఎసిబి రవి కుమార్, డిపియం ఫెయినాన్స్ లక్ష్మ నాయుడు, నాలుగు మండ లాల ఎపియంలు, సీసీలు, విఒఎలు పాల్గొన్నారు

బిఎల్‌ఒలపై ఒత్తిడి

ప్రజాశక్తి- వేపాడ

బిఎల్‌ఒలు, సచివాలయ సిబ్బంది పై స్థానిక అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో సచివాలయ సిబ్బందికి తామే ఉద్యోగాలు ఇచ్చామని, వాలంటీర్లను కూడా తామే నియమించామని గొప్పలు చెప్పడమే కాకుండా వారిపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఓట్లు మార్పులు, చేర్పుల్లో అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగా చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

3న గ్రంథాలయం ప్రారంభం

నెల్లిమర్ల: తంగుడుబిల్లిలో వచ్చే నెల 3న నూతన గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు శ్రీ రామ యువజన సంఘం సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. సిబిఐ మాజీ జేడి వివి లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆనంద్ ఫౌండేషన్ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ పాల్గొని గ్రూప్ 1 పరీక్షలో డిఎస్‌పిగా ఎంపికైన కెల్ల ఉదయ పావని, మొబైల్ బైక్ లైబ్రరీ నిర్వాహకులు రెడ్డి రమణలను సత్కరిస్తారని చెప్పారు.

హింసను ప్రేరేపిస్తే కేసులు

రేగిడి: హింస అనేది నేరమని అందుకు ప్రతి ఒక్కరూ మరొకరని హింస పెట్టరాదని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఎం గోవిందరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జెండర్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింసను ప్రేరేపించిన, ప్రోత్సహించినా కేసులు ఉంటాయన్నారు. హింస, భయం లేని జీవితాలతో మెలగాలన్నారు. వీరితోపాటు ఒప్పంగి సర్పంచ్, రేగిడి పిఎసిఎస్ సొసైటీ డైరెక్టర్ గంటా మోహన్ రావు ఉన్నారు.

రబీ పంటలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రతి రైతు రబీ సాగుపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాం సుందర్ అన్నారు. బుధవారం అలజంగి గ్రామంలో రబీ పంటలో రాగి పంట విస్తీర్ణం పెంచడానికి తీసుకోవలసిన వివిధ పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో నిర్వహించబోయే ధాన్యం కొనుగోలు వ్యవస్థ మీద రైతులకు అవగాహన కల్పించి దాన్యం కొనుగోలు మీద రైతులకు వివరించారు. క్వింటాకు మద్దతు ధర రూ.2183 చొప్పున కొనుగోలు చేయాలని రైతు గోనేసంచి పెట్టుకుంటే బస్తాకి రూ.3.39 ఇస్తామని చెప్పారు. హమాలీ ఖర్చు, ట్రాన్స్‌ఫోర్టు ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ధాన్యం తోలే వాహనాలకు విధిగా జిపిఎస్ పరికరం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పెంట లత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

కుక్కల దాడిలో 20 మేకలు మృతి

ప్రజాశక్తి - వంగర

వీధి కుక్కల దాడిలో 20 మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని మడ్డువలసలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు గంటమాని సన్యాసి తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంటి పక్కనే ఉన్న శాలలో మేకలన్నింటినీ పెట్టి తాను ఇంటిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి వేళ కుక్కల గుంపు ముకొమ్మడిగా వచ్చి తన మేకలపై దాడి చేయడంతో 20 మేకలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే మెలకువ వచ్చి కర్ర పట్టుకుని కుక్కలను తరిమి కొట్టకపోతే మిగతా మేకలపై కూడా దాడి చేసి చంపేసేవేనని బోరున విలపించారు. కుక్కలు మేకలపై దాడి చేయడం మేకలు మృతి చెందడంతో తనకు చాలా నష్టం జరిగిందని, పశు వైద్య సిబ్బందికి తెలియచేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఐదు పూరిళ్లు దగ్ధం

బొండపల్లి: మండలంలో గొల్లుపాలెంలో బుదవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన గొర్లె ముత్యాలు, గొర్లె రాము, గొర్లె గౌరి, గొర్లె పైడమ్మ, గొర్లె పెంటయ్యలకు చెందిన పూరిళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు తొత్తడి సత్తిబాబు అగ్ని ప్రమాద సహాయక చర్యల్లో పాల్గొని భాదితలకు బోజన వసతిని కల్పించారు.

గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ఒకరు మృతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని గవరవీధిలో ఈ నెల 19న గ్యాస్ సిలిండర్ నుండి వంట గ్యాస్ లీకై ఓ ఇంట్లో పేలుడు సంభవించిన ఘటనలో ముగ్గురు చిన్నారులతో సహా ఐదుగురుకు గాయాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరిలో తామరాపల్లి వెంకటలక్ష్మి (50) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మిగిలిన కెల్ల శ్రావణి (30), కెల్ల మోహన్ (10), కెల్ల లాస్య (8), తామరాపల్లి ప్రణవి (7) తదితరులు చికిత్స పొందుతున్నారు. మృతురాలు వెంకటలక్ష్మికి సిఐటియు మండల శాఖ కార్యదర్శి తరిణి వెంకటరమణ, విశ్వబ్రాహ్మణ సంఘం సంతాపం వ్యక్తం చేశారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, CHEEPURUPALLI
O.S.NO.120/2022

Between:
YEJJIPURAPU APPALA NAIDU .....PLAINTIFF
And
PINNINTI SATYAM .....DEFENDANT
To
Pinninti Satyam, S/o. Appa Rao, Hindu, aged about 36 years, residing at Thondrangi Village, Garividi Mandal, Vizianagaram District.

GENERAL NOTICE

Please take Notice that the above named plaintiff filed a suit against you for the recovery of the promissory note amount due together with interest. That the Honourable Court issue summons to you, but you avoiding to taking the same.

That the above suit is posted for you appearance at **10-30 A.M. on 20/12/2023** before the above said Court and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

(By order of the Honourable Court)

Majji Narasinga Rao,
Advocate,
Teacher's Colony, Garividi,
Cell No. 94404 25672.